

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 22 | సంచిక : 12 | ఆగష్టు 2017

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
08814 - 224747
9247104551

ఈ సంచికలో....

09-07-2017
జిన్నూరు
25-11-1984
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-07-2017, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు గురుపూర్ణిమ సందర్భంగా మనం ఇక్కడ సమావేశం అయ్యాము. భారతీయులకు, హిందువులకు దీపావళి, సంక్రాంతి ఎటువంటివో ఈ గురుపూర్ణిమ కూడా ఒక పండుగ. ప్రపంచంలో ఎక్కువ మంది మహాత్ములు పౌర్ణిమరోజున జన్మించారు. బుద్ధుడు కూడా పౌర్ణిమరోజున జన్మించాడు. అంతేకాదు బుద్ధుడు ఇల్లు విడిచి పెట్టింది కూడా పౌర్ణిమ రోజునే, ఆయనకు జ్ఞానోదయం అయ్యింది కూడా పౌర్ణిమ, చివరకు ఆయన శరీరం విడిచిపెట్టింది కూడా పౌర్ణిమ రోజునే. వ్యాసుడు ఆషాఢ పౌర్ణిమ రోజున శరీరం తీసుకున్నాడు. వ్యాసుడి యొక్క జన్మదినోత్సవాన్ని గురుపూర్ణిమగా నిర్ణయించి, దానిని గురువును గౌరవించేరోజుగా మన పెద్దలు ఏర్పాటు చేసారు. బి గుడ్, డు గుడ్ అని శివానంద చెప్పారు. డూ గుడ్ తేలికే గాని బి గుడ్ కష్టం. అంటే మీ తోటి మీరు పోరాటం పెట్టుకోవాలి. మనం ఇతరులతో పోరాడటం కంటే మనతో మనం పోరాడటం కష్టం. అందుచేత డూ గుడ్ కంటే బీ గుడ్‌గా ఉండటం చాలా కష్టం అని శివానంద చెప్పేవారు.

మీరు ఎంత ధనవంతులు అయినా, మీకు ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత యశస్సు ఉన్నా మీకు జ్ఞానం రాదు. పాండిత్యానికి జ్ఞానానికి సంబంధం లేదు. నాకు తెలుసును, నాకు తెలియదు అని చెప్పేది పాండిత్యానికి సంబంధించినది. ఇక్కడ జ్ఞానం అంటే ఇప్పుడు శరీరం ఎలా అయితే మీకు ఎఱుకలో ఉందో, మనస్సు ఎలా అయితే మీకు ఎఱుకలో ఉందో అలా మీ లోపలఉన్న సద్వస్తువు మీకు ఎఱుకలోనికి రావాలి, అది జ్ఞానం అంటే. అంతేగాని ఈ తెలుసును, తెలియదు అనేది అంతా అజ్ఞానంలో ఒక భాగమే. అందుచేత జ్ఞానానికి,

పాండిత్యానికి ఏమీ సంబంధంలేదు. రామకృష్ణుడు ఏమీ చదువుకోలేదు కాని ఆయన ప్రపంచానికి గురువు అయ్యాడు అంటే రామకృష్ణుడు 100% ప్యూరిఫైడ్ మేన్. ఈ ప్రపంచంలో ఇది నాది అని చెప్పేది ఆయనకు ఏమీ లేదు. అక్కడ నేను, నాది అని ఏమీ లేవు. మీకు ఏమి ఉంది అని ఎవరయినా అడిగితే మాకు ఏమీ లేదు అని చెప్పటానికి మనం సిగ్గుపడతాము కానీ రామకృష్ణుడు సంతోషిస్తాడు. ఎందుచేతనంటే ఆయన వాటిమీద ఆధారపడి లేడు, ఆయనకు లోపల బలం ఉంది. ధనం, పాండిత్యం ఇవన్నీ ప్రకృతి విషయాలు. ప్రపంచంలో ఏ పండితుడిని ఆయన పట్టించుకోలేదు. నీలో కనుక స్వార్థం ఉంటే లోపల ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తం కాదు. ప్రపంచంలో ఏ స్వార్థపరుడికి ఇంతవరకూ జ్ఞానం రాలేదు. మీ లోపల ఉన్న సద్వస్తువు ఎవడికి వ్యక్తం అవుతుంది అంటే దానిని నువ్వు తెలుసుకోలేవు, నీకు ప్యూరిటీ ఉంటే ఆ సద్వస్తువు దానంతట అదే నీకు ఎఱుకలోనికి వస్తుంది. మీకు చదువులేదు అందుచేత చదువుకున్న వాళ్ళ విలువ మీకు తెలియటం లేదు అని రామకృష్ణుడితో భక్తులు అనేవారు. వాళ్ళు బాగా చదువుకున్నారు అని మీరు చెపుతున్నారు, మీరు చెప్పేది రైటే అయితే వాళ్ళకు ఏమైనా తోకలు తెగాయా అంటే దేహబుద్ధి పోయిందా? ఏదైతే పోవాలో వాళ్ళకు అది పోయిందా అంటే దేహబుద్ధి పోయిందా వారికి. లోపల ఉన్న రియల్ ఐ తాలూకు ఎఱుక వాళ్ళకు ఏమైనా వచ్చిందా అంటే రాలేదు అయితే వాళ్ళు పెద్ద సున్నలు అని చెప్పారు. దేవేంద్రనాథ్ ఠాగూర్ పెద్ద పండితుడు. ఒకసారి రామకృష్ణుడిని శిష్యులు ఆయన దగ్గరకు తీసుకొని వెళ్ళారు. తిరిగివచ్చేటప్పుడు శిష్యులు రామకృష్ణుడితో ఆయన గొప్ప పండితుడు అని చెప్పారు. రామకృష్ణుడు ఏమన్నాడంటే వాడు చదువుకొన్న మాట నిజమే కానీ ప్రపంచంలో ఉన్న భోగాలు అన్నీ వాడికి కావాలి. ఇంక ఎందుకు వచ్చిన చదువులు. గొప్ప పండితుడు అని మీరు చెపుతున్నారు, ఆ పాండిత్యం అంతా పొయ్యిలో పెట్టుకోవాలి. అసలు ప్రకృతి లక్షణాలు పోవాలి కదా. ప్రకృతి గుణాలు పోకుండా ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత ధనం ఉన్నా వాడికి జ్ఞానం రాదు. చనిపోయేటప్పుడు ఈ పండితులు అంతా మేము చనిపోతున్నాము అని అనుకొంటున్నారు కదా. నువ్వు చావుని జయించాలి కదా. ఈ పాండిత్యం అంతా చావటానికా? చనిపోవటానికి చదువుకొంటున్నారా మీరు అంటున్నాడు రామకృష్ణుడు. అసలు నువ్వు ఎవడివో నీకు తెలియకుండా నేను చదువుకొన్నాను, నేను చదువుకొన్నాను అంటే నువ్వు ఫాల్స్ ఐ మధ్యలో ఉన్నావు కదా. నీకు డోయర్‌షిప్ పోలేదు, ఓనర్‌షిప్ పోలేదు. ఇవి రెండూ ఉన్నప్పుడు వాడు ప్రకృతిని జయించలేడు.

దేహప్రారబ్దంలో ఏదయితే ఉందో అది జరిగిపోతూ ఉంటుంది. మనం ఏమీ చేయలేము. మనం అనుకొన్నది జరగవచ్చు, జరగకపోవచ్చు. సృష్టిలో జరిగేదంతా ఈశ్వర సంకల్పమే. ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా భగవాన్ ఎప్పుడూ అబ్బురపడలేదు. ఆ

సంఘటన ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. ప్రపంచానికి అంతర్యామిగా ఉన్న వాడు ఆయనే. ఈశ్వరుడికి తెలియకుండా ఏదీ జరగదు. అందుచేత ఇందులో మనం ఆశ్చర్యపోవలసిన విషయం ఏమీ లేదు. ఉన్నది నలుబది సద్విద్య మీరు చదువుతూ ఉండండి. శబ్దంయొక్క అర్థం మీకు తెలిసినా, తెలియకపోయినా అలా చదువుతూ ఉండండి. అలా చదవటం వలన చివరకు ఆ శబ్దాలు పోతాయి, వాటి అర్థం మీ గుండెకు పడుతుంది.

గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. ప్రపంచంలో బయట ఉన్న చీకటిని సూర్యుడు పోగొడుతున్నాడు. కాని మన లోపలఉన్న చీకటిని పోగొట్టేవాడు గురువు. బయట ఉన్న చీకటిని సూర్యుడు ఎలా అయితే పోగొడుతున్నాడో అలాగే మనలోపల ఉన్న అజ్ఞానం, అవిద్య అనే చీకటిని పోగొట్టేవాడు గురువు. మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. అది మీకు తెలుసున్నా ఉంది, తెలియకపోయినా ఉంది. సూర్యుడు మనకు కనబడకుండా మేఘం ఎలా మూసేస్తుందో అలాగే మనలో ఉన్న అజ్ఞానం, అవిద్య లోపలఉన్న సద్వస్తువు మనకు తెలియకుండా మూసేస్తున్నాయి. సూర్యుడు మనకు కనబడకుండా మేఘం మూసేసినప్పుడు కూడా సూర్యుడి కంటే ఆ మేఘం గొప్పది కాదు. కాని సూర్యుడిని మూసేయటానికి పనికి వస్తోంది. అలాగే నీలో ఉన్న అజ్ఞానం నీ లోపలఉన్న సద్వస్తువు కంటే గొప్పది ఏమీ కాదు. గాలివేస్తే,మేఘం పోతుంది అలాగే గురువు అనుగ్రహం కనుక ఉంటే నీకు లోపల ఉన్న అజ్ఞానం పటాపంచలు అవుతుంది. మనం మనోదేహాలను నమ్మటానికి వీలులేదు. ఈ రోజు శరీరం బాగుంది. రేపు ఎలా ఉంటుందో మనకు తెలియదు. అలాగే మనస్సు కూడా ఈ రోజు నిర్మలంగా ఉండవచ్చు కానీ రేపు దానికి చపలత్వం రావచ్చు. ఎందుచేతనంటే ఇవి రెండూ నిజం కాదు కదా. నిజమయితే అది ఒకటిగా ఉంటుంది. కాని నిజం కానిది ఒకటిగా ఎలా ఉంటుంది. మన శరీరం, మనస్సు రేపు ఎలా ఉంటాయో మనకు తెలియదు. మన మనస్సు స్థిరంగా లేకపోవటం వలననే దస్తావేజులు రాసుకోవటం, పోలీస్‌స్టేషన్‌లు వచ్చాయి, మనస్సు స్థిరంగా ఉంటే ఇవన్నీ ఎందుకు? అందుచేత మనోదేహములను నమ్మటానికి వీలులేదు ఈ మనోదేహములతో లోపల ఉన్న సద్వస్తువుకు ఇసుమంతయు సంబంధం లేదు.

నీలోపల ఒక నిజం ఉంది. నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఈ జన్మలో కాకపోయినా రాబోయేజన్మలో అయినా దానిని తెలుసుకొనితీరాలి. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలియబడకపోతే నీకు ఫ్రీడమ్ లేదు, హేపీనెస్ లేదు, పీస్ లేదు. శరీరాలు ఒక దాని తరువాత ఇంకొకటి నిన్ను బంధిస్తూనే ఉంటాయి అని బైబిల్‌లో చెప్పాడు. సత్యం అంటే మనం నోటితో మాట్లాడుకొనేది కాదు, అసలు దానిని డిఫైన్ చేయలేము. ఆనందం అనేది అక్కడ తప్పించి ఇంక ఎక్కడా లేదు. ప్రపంచంలో ఆనందం ఉంది అనుకొంటున్నాము.

ఆనందం కోసం ప్రపంచంలో వెదుకుచున్నాము. ఎక్కడైతే ఆనందం లేదో అక్కడ ఆనందం కోసం వెదుకుచున్నాము. ఇలా లేనిచోట ఎంత వెదికినా నీకు ఆనందం దొరకదు. మనిషి సుఖపడాలంటే మెటీరియల్ సైడే కాకుండా స్పిరిట్యువల్‌సైడ్ కూడా గ్రోత్ ఉండాలి. స్పిరిట్యువల్ సైన్స్ కొంత అర్థం చేసుకోవాలి, దానిని అభ్యసించాలి. కేవలం అన్నం తిని మీరు బతకగలరా? బాహ్యంగా మనకు ఎవరో ఒకరి సపోర్టు ఉండాలి. అదే మీకు స్పిరిట్యువల్ స్టేటస్ కనుక ఉంటే, ఆ మెచ్యూరిటీ కనుక మీకు ఉంటే మీరు ఒక్కరు ఉన్నా కూడా, మనం ఒకళ్లమే ఉన్నాము అనే భావన లేకుండా జీవించగలరు. బుద్ధుడికంటే ఆచార్యులవారు తెలివైన వారు అని కృష్ణంరాజుగారు చెప్పారు. అది రైటే గాని ప్రపంచంలో బుద్ధుడికి వచ్చిన కీర్తి ఆచార్యుడికి రాలేదు. బుద్ధుడిలో ఏమీ బలహీనతలు లేవు. ఆయన రాజ్యాన్ని విడిచిపెట్టాక, రాజ్యాన్ని విడిచిపెట్టాను అనే తలంపు కూడా ఆయనకు రాలేదు. అసలు ఆ దేశానికి వారసుడిని పెట్టలేదు. అసలు ఒక్క బలహీనత కూడా ఆయనలో లేదు, 100% ప్యూరిటీ.

ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మీరు తీర్థయాత్రలు చేసినా, గుడులు చుట్టూ తిరిగినా ఇవన్నీ కూడా జ్ఞాని యొక్క ఒక్క చూపుతోటి సరిపోవు. జ్ఞాని యొక్క మాట శక్తివంతంగా ఉంటుంది. అది కొండలను దాటుతుంది, సముద్రాలను దాటుతుంది, ఈ ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. ఎందుచేతనంటే జ్ఞానియొక్క నాలుక హృదయంలో ఉంటుంది. మన నాలుక అయితే నోట్లో ఉంటుంది. మనం ఆలోచించేది వేరు, మాట్లాడేది వేరు, చేసేది వేరు. జ్ఞానికి అదేమీ ఉండదు. ఆయన హృదయంలో ఉన్నదే వస్తుంది. జ్ఞాని సత్యసంకల్పుడు. నువ్వు బాగుపడాలి అనే సంకల్పం ఆయనకు వస్తే అది నీ మీద పనిచేస్తుంది. జ్ఞాని యొక్క ప్రభావం భక్తుల మీద ఉంటుంది. జ్ఞాని అన్నా, మహాత్ముడు అన్నా, గురువు అన్నా ఇవి అన్నీ పర్యాయపదాలు. మనం గురువును పట్టుకొంటే మనం వదిలేస్తే వదిలేయవచ్చు. అలాకాకుండా గురువు మనలను పట్టుకొంటే వదలటం కుదరదు. ఇప్పుడు నా విషయం చెపుతున్నాను. నేను భగవాన్ రూపం ఎప్పుడూ చూడలేదు, ఆయన సాహిత్యం ఎప్పుడూ చదవలేదు, భగవాన్ పేరు ఎవరైనా చెపుతుంటే వినలేదు. ఆయనే నాకు స్వప్న దర్శనం ఇచ్చి, ఆయన వివరాలు చెప్పి నన్ను ఎత్తుకున్నారు, అప్పుడు నాకు భయం వేసింది. ఆయన నాకు ఒక కిస్ ఇచ్చి, ప్రస్తుతానికి ఇది సరిపోతుంది అన్నారు. నేను భగవాన్‌ను తీసుకోలేదు, ఆయనే నన్ను తీసుకున్నారు. అందుచేత ఎటాచ్‌మెంట్ పోయే అవకాశం లేదు, పులి నోట్లో పడ్డ మాంసపు ముక్కను బయటకు తీయవచ్చునేమో గాని, గురువు అనుగ్రహంలో పడినవాడు బయటకు వచ్చే అవకాశం లేదు. వాడిని రక్షించి తీరుతాడు. అంటే గురువు యొక్క ప్రభావం అంత తీవ్రంగా ఉంటుంది. గురువు చేసే సహాయం మన కళ్లకు కనబడదు, చెవులకు వినబడదు. అవి మనకు అర్థంకాని విషయాలు.

వాసనల సమూహమే మనస్సు. మనస్సు మేటర్ లేకుండా ఉండలేదు. మనస్సు శరీరాన్ని క్రియేట్ చేస్తుంది. మనం నో మైండ్ స్టేట్‌కు రావాలి. నో మైండ్ స్టేట్‌ని పొందటానికి మన ప్రయత్నం ఏదో మనం చేస్తూ ఉంటాము. కాని గురువు సహాయం లేకుండా అది కంప్లీట్ అవ్వదు. మనకు గురువు బిగ్గెస్ట్ రెలిటివ్. వారు చుట్టాలు, వీరు చుట్టాలు అని మనం ఏదో అనుకొంటాము కాని గురువును మించిన పెద్ద బంధువు మనకు ఎవరూ లేరు. గురువుకంటే మన క్షేమం కోరేవాడు ఎవడూ లేడు. తల్లిదండ్రులు మనకు బట్టలు కొని ఇవ్వవచ్చు, చదువు చెప్పించవచ్చు. ఇవి అన్నీ భౌతికం. గురువు యొక్క ప్రేమ అది అన్ వరల్డ్ లవ్. అది భౌతికానికి సంబంధించినది కాదు. గురువు ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితికి మనలను తీసుకొనిపోయేవరకు ఆయన మనలను విడిచిపెట్టడు, ఆ జన్మకాజన్మ మనలను వెంటాడుతూనే ఉంటాడు. మీరు భగవాన్‌కు ఎప్పుడూ పూజ చేయటం లేదు అయినా మీరంటే ఇష్టపడుతున్నాడు. మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు కారణం ఏమిటి అని ఒక డాక్టరుగారు అడుగుతున్నారు. పైగా సుందరంగారు ఒక మాట అన్నారు భగవాన్‌కు శరీరం లేదు, మీకు శరీరం ఉంది. శరీరం ఉండటం లేకపోవటమేకాని ఇంక తేడా ఏముంది అంటున్నారు? అయితే భగవాన్‌కు ఉన్న స్పిరిట్యువల్ స్టేటస్ నాకు ఉందా అంటే లేదు అని తెలిసినా అలా చెప్పేస్తున్నారు. అలా చెప్పించేవాడు కూడా ఆయనే. గురువు యొక్క అనుగ్రహానికి అసాధ్యమంటూ ఏమీ లేదు. ఆయన ఏదైనా చేయగలడు. బైబిలులో ఒక మాట ఉంది. కొండమీద దీపం పెట్టి అది ఎవరికీ కనబడకూడదు అంటే ఎలా కుదురుతుంది? అలాగే నీకు జ్ఞానోదయం అవుతూ ఉంటే మీ ఇంట్లో వారు నిన్ను మూసేస్తాము అంటే ఎలా కుదురుతుంది? మీ అమ్మ, నాన్న నిన్ను ఎవరికీ కనబడనివ్వము అని బట్టపెట్టి మూసేస్తాము అంటే అది కుదరదు.

మీకు ఇంటినిండా డబ్బు ఉంది కాని మిమ్మల్ని దుఃఖం వెంటాడుతోంది. మిమ్మల్ని అలాగే ఉంచితే ఎలాగ? దుఃఖంలేనిస్థితికి మిమ్మల్ని తీసుకొనిపోవాలి కదా! అసలు గురువు యొక్క లక్ష్యం అదే. మీ అమ్మ బట్టలు కొని ఇస్తుంది కాని మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొనిపోలేదు. అది గురువుకే సాధ్యం. గురువుతో సాంగత్యం వలన బాహ్యంగా దాని ప్రభావం నీకు తెలియకపోయినా అది నీ హృదయంలో ఉన్న నిజాన్ని పట్టియిస్తుంది. ఒక అమెరికన్ సైంటిస్టు ఏమని చెప్పాడు అంటే శరీరం పోయినప్పుడు ఇంక జీవితం కూడా ముగిసిపోతుంది, మరణానంతరజీవితం లేదు అని అనుకొనేవాడిని. నేను సౌత్ఇండియాలో ఒక మహర్షిని చూసాను. ఆయన నాతో మాట్లాడలేదు, నేను ఆయనతో మాట్లాడలేదు. నేను అక్కడ 40నిమిషాలు కూర్చొన్నాను. ఆయన నావంక చూసారు, నేను ఆయనను చూసాను, ఒక్కమాటలేదు. కాని ఆయన సమక్షంలో కూర్చోవటం వలన నా హృదయంలో

ఏదో నిజం ఉందని నాకు స్ఫురించింది. కాని ఆ ఉన్నదేదో నాకు తెలియటం లేదు అన్న సంగతి కూడా స్ఫురించింది. యిప్పుడు దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి అంత వరకు ఆయన నాకు ఉపయోగపడ్డాడు అని చెప్పాడు. గురువు మౌనంగానే పని చేస్తాడు. ఒకవేళ గరువుకు మీ పట్ల దయ ఉన్నా అల్లరిగా ఉండదు. ఆయన మౌనంగానే పనిచేస్తాడు. మీ అమ్మ నీకు ఒక ఎకరం పొలం యిస్తే మా అమ్మాయికి ఎకరం పొలం ఇచ్చాను అని ఊరంతా చెపుతుంది కదా. గురువుకు అదేమీ ఉండదు. ఆయనకు పబ్లిసిటీ అక్కరలేదు, గుర్తింపులు అక్కరలేదు. మీరు కష్టపడితే గుర్తింపులు కోరుకొంటారు. అదే చెడ్డ. దానివలన ఈగోసెన్స్ పెరిగిపోతుంది. గురువు నీతో మాట్లాడకపోయినా ఆయన మౌనంగానే పనిచేస్తాడు. మాటకంటే మౌనం శక్తివంతమైనది. మానసిక సంకల్పం ముఖ్యం. శరీరాలు దూరంగా ఉన్నా వారు బాగుండాలి అని మనస్సులో అనుకొంటే చాలు. దగ్గరగా ఉండి విరోధంగా ఉండటం కంటే, దూరంగా ఉండి ఆప్యాయతగా ఉండటం మంచిది.

ఒక అమ్మాయి భగవాన్‌తో చెపుతోంది నేను ఈ రోజు మా దేశం ఇంగ్లండ్ వెళ్లిపోతున్నాను. ఎక్కువగా ఇండియాకు రాలేను. నన్ను జ్ఞాపకం పెట్టుకోండి అని భగవాన్ తో చెప్పింది. అప్పడు భగవాన్ ఏమన్నారంటే యిఫ్ యు రిమెంబర్ మి, ఐ విల్ రిమెంబర్ యు. నువ్వు నన్ను జ్ఞాపకం పెట్టుకొంటే నేను నిన్ను జ్ఞాపకం పెట్టుకొంటాను అన్నారు. అప్పడు ఆ అమ్మాయి ఏమందంటేమీరు కండిషన్ పెడుతున్నారు. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకొంటే మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకొంటాను అంటున్నారు, ఈ మాటలుఅన్నీ కూడా జీవ లక్షణాలు. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకోకపోయినా మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోవాలి కదా అంది. నేను పొరపాటు మాట్లాడాను, నువ్వు చాలా గట్టి అన్నారు భగవాన్. గురువు అంటే ఆ శరీరం కాదు. శరీరం కాదు కాబట్టే ఆ శరీరంపోయినా ఆయనతో మనకు ఉన్న సంబంధం కంటిన్యూ అవుతూ ఉంటుంది. గురువు అంటే శరీరం కాదు. ఆ శరీరం చనిపోతుంది కాని అనుబంధం మాత్రం చనిపోదు, దానికి ముగింపులేదు. గురువు ఏస్థాయిలో ఉన్నాడో ఆ స్థాయికి మనలను తీసుకొనిపోయేవరకూ ఆ అనుబంధం తెగిపోదు. భగవాన్ గొడవ మనకు ఎందుకు అని ఇప్పడు నేను అనుకొన్నా అది సాధ్యం కాదు. ఆయనతో విడిపోవటం అనేది సాధ్యంకాదు. అదర్‌నెస్ ఉంటే ఫియర్ వస్తుంది. అదర్‌నెస్ లేకపోతే నీకు ఫియర్‌కూడా లేదు. ఇంట్లో వారిని కూడా వారు వేరు, మనం వేరు అనుకొంటాము కదా. అక్కడ సెపరేట్‌నెస్ ఉంటుంది కదా. అందులోనుండి రాగం వస్తుంది, భయం వస్తుంది. రెండులో నుండే ఫియర్,రాగం అన్నీ వస్తున్నాయి, ఒకటిలోనుండి ఏదీ రాదు.

వాసనాక్షయం ముఖ్యం. వాసనలే పునర్జన్మలను తీసుకొని వస్తాయి. వాసనలో నుండే కోరికలు వస్తాయి. నీకు ఏ రకమైన వాసన లేదు అనుకో. ఇంక నీకు ప్రపంచంతో

పని ఏముంది. వాసనలు లేకపోతే మనం లక్షమంది మధ్యలో కూర్చొన్నా మనం ఒంటరిగా ఉన్నాము అనిపిస్తుంది. మహాత్ములు సమక్షంలో వాసనలు అణుగుతాయి. వాసనలు బయటకు వెళ్ళేటప్పుడు దానికి ఎంత బలం ఉందో చూపించిగాని అది బయటకు పోదు. దాని బలం చూపించినప్పుడు మనం ప్రశాంతంగా ఉంటే అది బయటకు పోతుంది. మనం ప్రశాంతంగా నిలబడకుండా ఉంటే, మనం ఓడిపోతే అది మరల రిపీట్ అవుతుంది. అలా మనం ఓడిపోకుండా చూసేవాడే గురువు. వాసన పోతేగాని మనస్సు అణగదు. మనస్సు అణిగితే కాని సమాధిస్థితి రాదు. మన హృదయంలో ఉన్న నిజం మనకు అనుభవంలోనికి రావాలంటే మన ప్రయత్నం అవసరమే. గురువు యొక్క దయ లేకుండా కేవలం నీ ప్రయత్నం వల్లనే అది అనుభవంలోనికి రాదు అంటే నీ ప్రయత్నంతో పాటు గురువు యొక్క అనుగ్రహం ఉండాలి. మన గురించి ఎవరైనా సర్టిఫికేట్ ఇస్తూ ఉంటే ఇదంతా అబద్ధం అని నాకు అనిపిస్తుంది. చోడవరం డాక్టరుగారు జిన్నూరు ఎప్పుడూ రాత్రిటైములో వచ్చేవారు. ఏమండీ మీరు కష్టపడి రాత్రిళ్ళు వస్తున్నారు, పగలు వస్తే బాగుంటుంది అంటే పగలు రావటం నాకు కుదరదండీ అని చెప్పేవారు. నేను చాలా తిరిగాను కానీ మీ దగ్గర పొందిన శాంతి నేను ఎక్కడా పొందలేదు. అందుచేతనే కష్టపడి వస్తున్నాను. నేను మీకోసం రావటంలేదు, నాకోసం మీదగ్గరకు వస్తున్నాను అని చెప్పేవారు. ఆయన చనిపోయేముందు రోజున భార్యతో ఇలా అన్నారట ఈ జన్మలో నాన్నగారు ఇక్కడకు రారు, నేను జిన్నూరు వెళ్ళలేను, ఇంక ఈ జన్మలో ఇద్దరం కలుసుకొనే అవకాశం లేదు అని చెప్పారట. ఏదో మామూలుగా అంటున్నారు అని భార్య ఆ మాటలు పట్టించుకోలేదు. మరుసటి రోజున ఆయన చనిపోయారు. అది జాన్మంతర అనుబంధం. శరీరాలు ఎక్కడ ఉన్నా మానసికఅనుబంధం పనిచేస్తుంది. బైబిల్‌లో ఒక మాట ఉంది. నీ పొరుగు వారు ఎవరు? నీ పొరుగువాడు ఎవడు అంటే నీ ఇంటి ప్రక్కన ఉన్న వాడు అని కాదు, మీ క్షేమం కోరేవాడు ఎక్కడ ఉన్నా వాడు మీ పొరుగువాడే. మా యింటికి రండి అని భగవాన్‌ను కొంతమంది అడిగేవారు. ఇప్పుడు నేను మీ యింటి దగ్గర ఉన్నాను కదా. ఇంక మీ యింటికి రావటం ఏమిటి? నువ్వు కిచెన్‌లో ఎక్కడ ఏమి పెట్టుకొన్నావో? నువ్వు డబ్బు ఎక్కడ దాచుకొన్నావో చెప్పమంటావా? నేను మీ యింటి దగ్గర లేను అని నువ్వు అనుకోవచ్చు కాని నేను మీ యింటి దగ్గరే ఉన్నాను అన్నారు భగవాన్.

సత్సంగం అంటే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో కలిసి ఉండటం. అది నీకు సాధ్యమవుతుందా? నువ్వు హృదయంలో ఉండగలవా? అది నీకు సాధ్యంకాదు. మీ వాసనలు అక్కడ ఉండనివ్వవు. అందుచేత సద్వస్తువు తాలూకు ఎఱుక ఉన్న వ్యక్తులతో బయట నువ్వు సహవాసం చెయ్యాలి. నీ హృదయంలో ఉన్న సద్వస్తువుతో నీకు అనుబంధం

ఉంటే బాహ్యమైన వాళ్ళతో నీకు పనిలేదు. నీకు ఆ ఎటాచ్‌మెంట్ లేదు కాబట్టి దాని తాలూకు ఎఱుక ఉన్న వారితో సహవాసం చేయటం వలన వాళ్ళ వైబ్రేషన్స్ నీమీద పనిచేస్తాయి. నువ్వు ఇప్పుడు మనస్సు యొక్క పరిధిలో ఉన్నావు కదా. వీళ్ళు నా వాళ్ళు, వాళ్ళు పరాయి వాళ్ళు అని ఇలా అనుకొంటున్నావు కదా. గురువు ఆ బౌండరీని దాటిస్తాడు, అది గురువు చేసే సహాయం. గురువు నీకు చేసే సహాయం అది ఇతరులకు తెలియాలి అని ఆయన అనుకో. ఆయనకు ఇతరులు లేరు. మీరు శాంతిగా ఉండాలంటే, సుఖంగా ఉండాలంటే అదర్‌నెస్ ఉండకూడదు. భగవాన్ టీచింగ్‌లో అదర్‌నెస్ ఉండదు. అదర్‌నెస్ కనుక లేకపోతే నువ్వు అలా కూర్చొని ఉండగానే లిబరేషన్ వచ్చేస్తుంది. సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది అది నీకు తెలిసినా ఉంది, తెలియకపోయినా ఉంది. అది కొత్తగా వచ్చేదికాదు. ఉన్న దానిని గుర్తించటమే మీరు చేయవలసిన పని. ఉన్నవస్తువును తెలుసుకోవటానికి ఏ వాసనలు, కోరికలు, బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో, వాటిని తొలగించుకొంటే ఆ వస్తువు నీకు వ్యక్తమవుతుంది. అది నువ్వు తెలుసుకొనేదికాదు. నీ మనస్సు పవిత్రమైతే, నువ్వు 100% ప్యూరిటీని గెయిన్ చేస్తే అది నీకు తెలియబడుతుంది. టీనేజ్ ఈజ్ వరస్ట్ ఏజ్ అని చెపుతారు. ఆ ఏజ్‌లో మెచ్యూరిటీ ఉండదు. వారు ఆలోచించుకోలేరు, ఇతరులు చెపితే వినరు. అటువంటి ఏజ్‌లో భగవాన్‌కు జ్ఞానం వచ్చింది. టీనేజ్‌లో భగవాన్‌కు మరణానుభవం ద్వారా మరణంలేనివస్తువు రివీల్ అయ్యింది. శరీరం చనిపోయింది. దానిని దహనం చేస్తారు. శరీరం చనిపోయినప్పుడు మనం పోవాలికదా! అయినా పోకుండా ఉన్నాము ఏమిటి? శరీరం పోయినా మనం ఉన్నాము అనే అనుభవం ఆయనకు వచ్చింది. ఇది చాలా గొప్ప అనుభవం. ఆ క్షణంలో ఆయనకు భయం పోయింది. రెండు ఉంటే భయం. ఉన్నది ఒక్కటే అయితే భయం లేదు. ఆ ఒన్‌నెస్ నీకు అనుభవంలోనికి రావాలి. నీ శరీరం ఎక్కడ ఉంది అనేది ముఖ్యంకాదు. నీ మనస్సు ఎక్కడ ఉంది అనేది ఈశ్వరుడు చూస్తాడు. నీ శరీరం సత్సంగం దగ్గర కూర్చోవటం కాదు, మనస్సు కూడా సత్సంగం దగ్గర ఉంటే అప్పుడు దానిని ఈశ్వరుడు హృదయంలోనికి లాగుతాడు. నువ్వు హృదయంలోనికి వెళ్ళలేవు, అంతర్యామే నిన్ను లోపలకు లాగుకొంటాడు. నువ్వు అమెరికాలో ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చుని సద్వస్తువుతో కలిసి ఉండవచ్చు. అలా ఉండలేనప్పుడు సద్వస్తువు తాలూకు అనుభవం ఉన్న మనిషి నీకు దొరికితే వారి సాంగత్యం మంచిది. అదే హోలీ కంపెనీ. అటువంటి వారి సమక్షంలో నీ మనస్సు అణుగుతుంది. నీకు అంతర్‌దృష్టి కలుగుతుంది. అంతర్‌దృష్టి కలగకుండా ఆత్మజ్ఞానం కలుగదు. నీ మనస్సుకు అంతర్‌దృష్టి కలుగజేసేవాడే గురువు. ఎవరి సమక్షంలో నీ మనస్సు అంతర్ముఖం అవుతుందో వాడే నీకు గురువు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-11-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం ఏ పని చేసినా మన సుఖం కోసమే చేస్తున్నాము. ఏ పని చేసినా మన ఆనందం కోసమే చేస్తున్నాము. కాని దేవుడి కోసం చేస్తున్నామని మనం అనుకొంటున్నాము. అది అబద్ధం. దేవుడిని తెలుసుకోవటం కూడా, మన ఆనందం కోసమే దేవుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము అన్న సంగతి కూడా మనకి తెలియదు. దేవుడిని తెలుసుకోవాలని ప్రయత్నం చేసే వాళ్ళు కూడా వాళ్ళ ఆనందం కోసమే, వాళ్ళ సుఖం కోసమే వాళ్ళు దేవుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారన్న సంగతి వాళ్ళకి తెలియదు. వాళ్ళ సొంత సుఖం కంటే వాళ్ళకు దేవుడు ఎక్కువకాదు. వాళ్ళ సుఖ అన్వేషణలో దేవుడు కూడా ఒక భాగం. ఒక కళారంగంలో కానీ, సాహిత్యంలోకానీ, ఆధ్యాత్మిక రంగంలో కానీ, అధికార రంగంలో కానీ, వాడికి తెలియకుండా వాడు ఆనందం కోసమే వెదుకుతుంటాడు. ఆనందం కలిగించలేకపోతే ఈ సాహిత్యం ఎందుకు, కంఫర్ట్ కలిగించలేకపోతే ఈ సైన్సు ఎందుకు? మనం ఆరోగ్యం కోరుకొనేది కూడా మన ఆనందం కోసమే. అనారోగ్యం ఉంటే దుఃఖం వస్తుంది. అందుచేత ఆరోగ్యాన్ని కోరుకొంటున్నాము. ఆరోగ్యం మన ఆనందం కోసమే. మనం డబ్బుని ప్రేమిస్తున్నాము. మనకి సుఖాన్ని ఆనందాన్ని ఇస్తుందని మనం డబ్బుని ప్రేమిస్తున్నాము. లేకపోతే డబ్బు ఏం చేసుకొంటాము.

మన దేహం యొక్క రంగు అంటే మనకి చాలా ఇష్టం. కానీ దేహం యొక్క రంగు గొప్పగా ఉన్నంతమాత్రం చేత జీవితం కూడా అందంగా ఉంటుందని ఎక్కడా చెప్పలేదు. అలా చెప్పే అవకాశాలు లేవు. ఎవడి దేహం అయితే గొప్పగా ఉందో, ఎవడి దేహం పుష్టిగా ఉందో, అంతమాత్రంచేత వాడు జీవితరంగంలో కూడా పుష్టిగా ఉంటాడని, వాడి జీవితం ఆనందమయంగా ఉంటుందని, కళాత్మకంగా ఉంటుందని చెప్పలేము. ఎవరి మనస్సు అయితే శుద్ధిగా ఉంటుందో, ఎవరి మనస్సు అయితే ఆరోగ్యంగా ఉంటుందో, దేహంలో అందం లేకపోయినా, ఎవరి మనస్సు అయితే అందంగా ఉంటుందో, వారి జీవితం అందంగా ఉంటుంది. సుఖంగా ఉంటుంది, శుభసూచకంగా ఉంటుంది. మనం జీవితం పొడుగునా మన దేహం యొక్క సౌందర్యం కోసం కృషి చేస్తున్నాము. కానీ మనస్సు యొక్క సౌందర్యం కోసం మనం జీవితంలో కృషి చెయ్యటం లేదు. మనస్సు యొక్క సౌందర్యం మనం చూడలేనప్పుడు, రసాత్మకమైన గుణాలు మనలో లేనప్పుడు, కళ్యాణగుణాలు మనలో లేనప్పుడు, మనస్సుయొక్క లోతులు తెలియనప్పుడు, మనస్సులో ఉండే అందాలు మనం చూడలేనప్పుడు జీవితాన్ని సుఖమయముగా ఆనంద మయముగా చేసుకొనే అవకాశాలు ఎక్కడా లేవు. ప్రతివ్యక్తి తన దేహం అందం కోసం ఎంతో ఖర్చు పెడతాడు. స్నోకి, పౌడరుకి ఖర్చు పెడతాడు.-

తన దేహ సౌందర్యాన్ని కలగచేసే వస్తువులకోసం ప్రతి మనిషి ఎంతో కృషి చేస్తాడు. ఇక్కడ మన ఇండియాలో అలవాటు లేదుకానీ, ఇంగ్లండులో అక్కడా ముక్కు అందంగా ఉంటే ఆ ముక్కుని కూడా ఇన్సూరెన్స్ చేయించుకొంటారు. అంటే మన దేహానికి అంత విలువ ఇస్తున్నాము. దేహం ప్రధానం అనుకొంటున్నాము, మనస్సు అప్రధానం అనుకొంటున్నాము కానీ అసలు మనస్సు అంటే ఏమిటో, దాని విలువలు ఏమిటో తెలియనివాడికి, ఆత్మ గురించి, దైవం గురించి అసలు తెలియనే తెలియదు.

మాటకి మాట అందించే వాళ్ళు అందరూ చాలా ధైర్యవంతులని, ప్రతిభావంతులని, మనం అనుకొంటాము. ఎవడైతే మాటకి మాట అందివ్వకుండా, సహనంతోటి ఎవడైతే భరిస్తాడో వాడే నిజమైన పరాక్రమవంతుడు. ఎక్కాల పుస్తకంలో ఎక్కాలు ఒప్పచెప్పినట్టు మాటకి మాట ఒప్పచెప్పటం తేలికే. కానీ మాటని భరించి శాంతితో ఎవడైతే సహిస్తున్నాడో వాడే ధీరుడు, వాడే వీరుడు, వాడే పరాక్రమవంతుడు. చిన్న మాటనే మీరు సహించలేనప్పుడు ఆత్మని తెలుసుకోవటానికి ఎలా ప్రయత్నం చెయ్యగలరు? ఎదుటి మనిషి మాట్లాడే మాటనే, ఒక చిన్న మాటనే సహించే శక్తి మీకు లేనప్పుడు, ఆత్మని తెలుసుకోవటానికి మీ మనస్సు ఎలా అర్హత సంపాదిస్తుంది?

ఒకసారి ఎవరో హాలులో కూర్చొని, భగవాన్‌ని తిట్టుకొంటున్నాడు. పైకి తిడితే బాగుండదని లోపలే తిట్టుకొంటున్నాడు. అది భగవాన్ గ్రహించి, నువ్వు నన్ను తిడుతున్నావు అనలేదు. నువ్వు తిడితే ఎప్పుడూ మంచివాళ్ళనే తిట్టు, ఎందుచేతనంటే వాళ్ళు తిరిగి నీకు ఏమీ అపకారం చేయరు. మంచివాళ్ళు నీ మీద కక్ష సాధింపులు చెయ్యరు. వాళ్ళు భరిస్తారు, కానీ చెడ్డవాళ్ళని తిట్టకు, వాళ్ళు ఊరుకోరు, తిరిగి నీ లెంపలు వాయిస్తారు.

ఒక చిన్న మాట సహించలేనప్పుడు వాడు ఋషి ఎలా అవుతాడు, యోగి ఎలా అవుతాడు, భక్తుడు ఎలా అవుతాడు? మీరు ఆదివారం ఇక్కడికి వచ్చి ఈ మాటలు శ్రద్ధగా వింటున్నారు. మాకు ఎంతో కొంత భక్తి ఉంది, యోగం ఉంది అని కొంచెం గర్వం మీలో ఎవరికైనా వస్తోంది అనుకోండి, ఆదివారాలు ఇక్కడికి రాకుండా ఇంటి దగ్గరే ఉండి గర్వం లేకుండా ఉన్నవాళ్ళు ఉంటారనుకోండి, ఆధ్యాత్మిక రంగంలో మీకంటే వాళ్ళు ఎక్కువ అభివృద్ధి లోనికి వస్తారు. రోజూ గుళ్ళోకి వెళ్ళి అభిషేకాలు చేసి నేను భక్తుడిని అని గర్వం పొందేవాడి కంటే, అభిషేకాలు చెయ్యకుండా గర్వం లేనివాడు ఆధ్యాత్మిక రంగంలో తొందరగా అభివృద్ధి లోనికి వస్తాడు. అటువంటివాడికి ఈశ్వరుడు తన హృదయాన్ని ఇచ్చి, తన ఆలింగనంలోకి ఆ భక్తుడిని తీసుకొంటాడు. ఫిజికల్ ఎక్సర్‌సైజ్ వల్ల మనం ఈశ్వరుడిని మోసం చేయలేము.

ఈ సత్సంగాలు అవీ కూడా మనస్సుని పక్వం చేసుకోవటానికే, మనస్సుని పక్వం చేసుకోవటానికి ఈ సత్సంగాలు ఉపయోగపడకపోతే, ఈ సత్సంగాల వల్ల ప్రయోజనం ఏమీ

లేదు. ప్రతీ వస్తువు అందంగా ఉండాలని మనం అనుకొంటాము. మన ఇల్లు అందంగా ఉండాలనుకొంటాము. మనం కళ్లతో చూసే వస్తువులు అందంగా ఉండాలనుకుంటున్నాము. ఎందుకు ఇవన్నీ కూడా అందంగా ఉండాలి? ఇల్లు అందంగా ఉండాలి, గుడ్డ అందంగా ఉండాలి? ఇవన్నీ అందంగా ఉండాలని మనం కోరుకొంటున్నాము. ఎందుకు అందంగా ఉండాలి. అందంగా ఉంటే మనకి ఆనందం కలుగుతుంది. మన ఆనందం కోసం అందాన్ని కోరుతున్నాము. చివరికి మనం తినే కూరగాయలు కూడా బాగుండాలని మనం కోరుకుంటున్నాము. ఎందుకు? మన ఆనందం కోసం. తనకి తెలిసున్నా తెలియకపోయినా, ప్రతి మాటలో ప్రతిచేతలో కూడా ఆనందం కోసం అన్వేషిస్తున్నాడు.

ఆత్మదర్శనం అయ్యేవరకు నిజాన్ని దర్శించేవరకు ఏ మనిషి కూడా సంతృప్తి పడలేడు. సౌందర్యం ఏది? ఆత్మే సౌందర్యం. ఆత్మకి మించిన సౌందర్యం లేదు. దేహసౌందర్యం వాడిపోతుంది, రాలిపోతుంది. నిజమైన సౌందర్యం ఆత్మలోనే ఉంది. మనం అనుకొనే మాటలన్నీ కూడా వ్యవహారికసత్యాలు. నిజమైన సత్యం ఆత్మలోనే ఉంది. ఆత్మకి మించిన ఆనందం ఈ లోకంలో కాని పరలోకంలో కాని లేనేలేదు. ఈ లోకంలో ఏమి జరుగుతోంది, పరలోకంలో ఏమి జరుగుతోంది, పరలోకాలలో ఏమున్నాయి అని ఇవన్నీ ఆలోచిస్తూ ఉంటారు ఇది దురదృష్టం. పరలోకాలని చూసే నువ్వు ఎవడవు? ఈ లోకాన్ని చూసే నువ్వు ఎవడవు? ఆ నువ్వు ఎవడో నీకు తెలియకపోతే నీకు ఆత్మ తెలియదు, జన్మ పరంపరలలో ఇలా కొట్టుకుపోతూ ఉండవలసిందే. ఆ లోకం గొప్పగా ఉంది. స్వర్గలోకం గొప్పగా ఉంది అని లోకాల గురించి ఆలోచిస్తున్నారు. ఆ లోకాల గురించి ఆలోచించే వాడెవడు? నువ్వు లేకుండా ఆ లోకాలు ఉన్నాయా అసలు? చూసేవాడు లేకుండా, చూడబడే లోకాలు ఉన్నాయా?

మనం దేహం గురించి ఆలోచిస్తున్నాము కానీ, మనకు వచ్చే తలంపుల గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నామా? తియ్యటి తలంపులు, మధురమైన భావాలు, ఎప్పుడైనా మన హృదయంలో ప్రవేశించాయా? మనలో ఎవరికైనా వైరాగ్యం ఉందా? వైరాగ్యం లేనివాడికి జ్ఞానం కలగదని భగవంతుడు చెపుతున్నాడు. మనలో ఎవరికీ వైరాగ్య ం లేదు, కారణం భగవంతుడు చెప్పిన మాటలమీద మనకి విశ్వాసం లేదు, అందుచేత మనకి వైరాగ్యం కలగటం లేదు. జ్ఞానం రావటం లేదు. మాటవరసకి నేను సిగరెట్టు కానీ చుట్ట కానీ కాలుస్తున్నాననుకోండి, లేకపోతే రోజూ సినిమాలకి వెళ్లే అలవాటు నాకు ఉందనుకోండి, మన భక్తులందరూ సినిమాలకి వెళ్లటం లేదు, నేను మటుకు సినిమాలకి ఎందుకని వెళ్లటం మానేసినా సినిమా చూడాలనే కోరిక నాలో ఉండిపోయింది అనుకోండి, అది మరుసటి జన్మలో కూడా వచ్చేస్తుంది. అంటే కర్మ ఆగింది, వాసనలు రహితం అవ్వలేదు. వాసన లోపల ఉంది, అందుచేత ఈ వాసన మళ్లీ

జన్మలో విజృంభిస్తుంది. నాకు కోరిక లేక నేను మానేయలేదు, మీ గౌరవం కోసం మానేస్తాను. మీరే మానేసినప్పుడు నేను చూస్తే ఎలా అని సినిమాలు మానేసాను, కాని చూడలనే కోరిక నాకు ఉంది, ఈ వాసన రాబోయే జన్మలో విజృంభిస్తుంది. కళ్ళతో చూడటం మానేసాను కానీ లోపల వాసన ఉంది కదా. ఆ వాసనని ఎప్పడైతే రహితం చేసుకున్నానో అప్పడు నాకు జ్ఞానం కలుగుతుంది కానీ, బాహ్యంగా పెద్దమనిషిగా ఉన్నప్పటికీ లోపల మనస్సులో మురికి గుంటలు పెట్టుకుంటే, లోపల మనస్సులో నిండా వాసనలు ఉంటే, మరల జన్మలు రావలసిందే, అవి ఖర్చు అవ్వవలసిందే. అందుచేత ఎవడైతే శరీరంలో ఉన్నాడో, వాడికి కర్మేంద్రియాలు ముఖ్యం కాదు, కర్మేంద్రియాలు అరికట్టటం ఒక భాగం మట్టుకే. లోపల ఎవడైతే వాసన రహితం చేసుకొంటున్నాడో, వాడు జ్ఞాని అయ్యే అవకాశం ఉంది. బయటికి కర్మ చేయటం మానేసినప్పటికీ ఎవడైతే వాసనా సహితంగా ఉంటున్నాడో, వాడు జ్ఞాని అయ్యే అవకాశం లేదు, యోగి అయ్యే అవకాశం లేదు. ఈశ్వరానుగ్రహం ఉన్నవాడికి కానీ వాసనారహితం అవ్వదు. వాసనారహితం అయితే అది ఈశ్వరానుగ్రహానికి గుర్తు.

మన అహంకారం ఏమి చేస్తుందంటే తను మరణించకుండా ఉండటం కోసం అనేక విషయాలని కల్పిస్తూ ఉంటుంది. తను కల్పించిన విషయాలని అన్వేషిస్తూ ఉంటుంది. కానీ తన మూలం లోకి అది వెళ్ళదు. తన మూలంలోకి వెళ్ళితేనే కానీ అది నాశనం అవ్వదు. ఒక ఇంగ్లీషుకవి చెప్పాడు. సర్వసాధారణంగా పక్షులు చేదుపండుమీద వాలవట. తియ్యగా ఉన్న మామిడిపండుమీదో తియ్యగాఉన్న జామకాయమీదో వాలతాయట. చేదుగా ఉన్న పండ్లమీద పక్షులు వాలవు. దూరంగా ఉంటాయి. అదేవిధంగా ఈ లోకంకూడా మంచివాళ్ళని విమర్శిస్తూ ఉంటుంది. మంచివాళ్ళ మీద బెడ్డలు వేస్తూ ఉంటుంది. దుష్టులకి దూరంగా ఉంటుంది.

మన ఇంద్రియాలకి అందని పరమేశ్వరుడిని, మన బుద్ధితో పట్టుకోలేని పరమేశ్వరుడిని మన మనస్సుతో ఊహించి తెలుసుకోలేని పరమేశ్వరుడిని ఇంద్రియాలతో మనస్సుతో తెలుసుకోవటానికి ప్రయత్నం చేసి ఫెయిల్ అవ్వటం తప్పించి, మనం సక్సెస్ అయ్యే అవకాశం లేదు. మీకు దేవుడిని చూడాలని ఉంది కానీ, దేవుడిని చూడాలని చెప్పేవాడు ఎవడు? వాడి గురించి ఆలోచించనంతకాలం మీకు జ్ఞానం కలగదు. మాకు దేవుడిని చూడాలని ఉందండీ అని మీరు అంటున్నారు రైటే. దేవుడిని చూడాలని ఉందని మీలో ఒకడు అంటున్నాడు కదా. వాడెవడో మీకు తెలియనప్పడు ఎన్నడూ మీరు జ్ఞానులు కాలేరు.

మనం పూజ గొప్పది అనుకొంటాము పని తక్కువది అనుకొంటాము. నేను ఒక అరగంట పూజ చేసాను. ఒక అరగంట జపం చేసాను, లేకపోతే ఒక అరగంట ధ్యానం చేసాను అని చెప్పే వాడికంటే, ఎవడైతే తన జీవితమే ఒక యోగంగా భావిస్తున్నాడో, జీవితాన్నే

ఎవడైతే ఒక యోగంగా తీసుకున్నాడో, వాడు ఆ జన్మలోనే తరిస్తాడు. జీవితమే ఒక యోగం. మన స్వరూపమే సుఖం, మన స్వరూపమే ఆనందం. అంటే మనకి తెలియకుండా మన కోసం మనం వెతుక్కొంటున్నాము. మన స్వరూపం కోసం వెతుక్కొంటున్నాము. దానికి సాహిత్యం అని దేవుడు అని అనేక పేర్లు పెట్టుకొంటున్నాము.

మిమ్మల్ని ఎవరు విమర్శించినా మీరేమీ కంగారుపడకండి. ఎందుచేతనంటే మీలో ఎంత ఔన్నత్యం ఉన్నప్పటికీ వాళ్ళలో లేనిది మీలో వాళ్ళకి కనపడదు. ఎవరైతే మిమ్మల్ని విమర్శిస్తున్నారో మీలో ఉన్న ఔన్నత్యం వాళ్ళలో లేదనుకోండి, అది వాళ్ళకి కనపడదు కాబట్టి మిమ్మల్ని విమర్శిస్తున్నారు. నాలో లేనిది నేను ఎదుటి వాళ్ళలో చూడలేను. గణపతిశాస్త్రిగారు వచ్చేవరకు, భగవాన్‌ని దిక్కులేని కుర్రవాడు అనుకొనేవారు. ఇంటిదగ్గరినుంచి పారిపోయి వచ్చాడు అనుకొనేవారు. ఇలా రకరకాలుగా అనుకొనేవారు ఎందుచేతనంటే ఆయనలో ఏముందో వాళ్ళకి తెలియదు. రామకృష్ణుడు, రమణుడు మహాత్ములు అంటారు కదా. మరి వాళ్ళిద్దరికీ క్యాన్సర్ జబ్బు వచ్చిందేమిటి అని కొంతమంది అడుగుతారు. అది చాలా చిన్న ప్రశ్న. అసలు మనిషియొక్క ఔన్నత్యం ఎక్కడుంది? ఒకడు రోగం రాకుండా ఆరోగ్యంగా జీవిస్తాడనుకోండి, అయితే వాడు గ్రేట్‌మేనా? పుట్టిన తరువాత అసలు హాస్పిటలుకి వెళ్ళకుండా ఇంజెక్షన్ చేయించుకోకుండా 80 ఏళ్ళు 90 ఏళ్ళు బతికిన వాళ్ళున్నారు. అయితే వాళ్ళందరూ అవతార పురుషులేనా? అసలు మనిషిని కొలవటం తెలియక ఈ ప్రశ్నలన్నీ. ఎదుటి మనిషిని ఎలా కొలవాలో తెలియక, కనీసం ఆ ప్రాథమిక జ్ఞానం లేకుండా వేసినది ఈ ప్రశ్న. మీకు కష్టం రాకుండా ఉండటం గొప్పది కాదు. వచ్చిన కష్టాన్ని మీరు కళాత్మకంగా భరిస్తూ ఉంటే, మనస్సులో హెచ్చుతగ్గులు లేకుండా భరిస్తుంటే అప్పుడు మీ జీవితం గొప్పది అవుతుంది. మాకు జీవితం సుఖంగా వెళ్ళిపోతోందండీ అంటారు కొందరు, వీళ్ళందరూ జ్ఞానులేనా? ఆ వచ్చిన క్యాన్సరుని రమణస్వామి ఎలా భరించాడు. ఆ వచ్చిన క్యాన్సరుని రామకృష్ణ పరమహంస ఎలా భరించాడు? అక్కడ ఉంది వాళ్ళ ఔన్నత్యం. వచ్చిన రోగాన్ని వాళ్ళు ఎలా భరించగలిగారు. అసలు రోగం వచ్చిందన్న సమస్య కాదు. అదే విధంగా జీవితంలో ఎన్నో కష్టాలు వచ్చి మన నెత్తిమీద పడినప్పటికీ, ఆ కష్టాల్ని మనము ఎలా తీసుకొంటున్నాము, వాటిని ఎలా భరించ గలుగుతున్నాము, సహించగలుగుతున్నాము,అనే విధానం మీద మనిషి యొక్క ఔన్నత్యం ఉంది. మనిషి యొక్క సంస్కృతి ఉంది. మనిషియొక్క నాగరికత ఉంది, సమాజం యొక్క పునాదులన్నీ అందులోనే ఉన్నాయి. సహించలేని జాతి, ఓర్పు లేని జాతి నశించి పోతుంది. ఓర్పులేని మనిషి, సంస్కృతి లేని మనిషి నశించిపోతాడు.

కొంతమంది మేము చాలా సుఖంగా జీవిస్తున్నామని అంటారు. కానీ వాళ్ళలో సభ్యత కాని సంస్కారం కానీ సంస్కృతి కాని ఏమీ కనపడని మనుషులని నేను చూశాను.

కొంతమంది జీవితం పొడుగునా కష్టాలతో కాలిపోతారు. కానీ ఎంతో మహోన్నతమైన ఉదాత్తమైన ఆలోచనలతో వెలిగిపోతారు. వారిని కూడా చూశాను. అందుచేత మీకు కష్టాలు రాకుండా ఉండటం గొప్పకాదు. వచ్చిన కష్టాన్ని ఎలా భరిస్తున్నారు. మీకు అనారోగ్యం రాకుండా ఉంటేనే మీరు ఋషులు అయిపోరు. అనారోగ్యం వచ్చినప్పటికీ దానిని ఎలా భరిస్తున్నారు. అది ముఖ్యం. మనకి విషం అంటే ఎంతో భయం. ఇప్పుడు గవర్నమెంటు ఉరిశిక్ష వేసినట్టు ఆ రోజులలో గవర్నమెంట్ సోక్రటీస్‌ని చంపుదామని విషం ఇచ్చింది. చాలా ప్రశాంతంగా మనం కాఫీ పుచ్చుకున్నట్టు విషాన్ని పుచ్చుకున్నాడట సోక్రటీస్. ఆయనకి మైండ్లో ఏమీ రియాక్షన్ రాలేదు. వాడు జ్ఞాని.

దేహం సౌందర్యంగా ఉన్నా కానీ జీవితంలో సౌందర్యం లేకపోతే వాడికి జ్ఞానం కలగదు. దేహం యొక్క సౌందర్యం గొప్పకాదు. జీవితం యొక్క సౌందర్యం గొప్పది. మిమ్మల్ని మహోన్నతమైన శిఖరాల వైపు నడిపించేది ఈశ్వరుడే కానీ ఈ ప్రపంచం మటుకు కాదు. ఈ ప్రపంచం చాలా క్రూరమైనది. ఈ ప్రపంచం కుక్క తోకలాంటిది. మనకి కాళిదాసు ఎటువంటివాడో ఆంగ్లసాహిత్యానికి మిల్టన్ అటువంటివాడు. తన కళ్ళు పోతే, తన కవిత్వమంతా కూతురు చేత వ్రాయించాడు. మిల్టన్ ఏమి చెప్పాడంటే భగవంతుడు మనకి ఏ ప్రారబ్దాన్ని అయితే అనుభవింపచెయ్యటానికి ఈ దేహాన్ని ఇచ్చాడో, ఏ కష్టసుఖాలని భరించటం కోసం ఈ దేహం మనకి వచ్చిందో, ఎన్ని అనుభవాలని తీసుకురావటం కోసం ఈ దేహాన్ని ఈశ్వరుడు మనకి ప్రసాదించాడో దానికి మనం ఎదురు తిరగకుండా, ఆ కష్టాలని సహిస్తూ భరిస్తూ ఆ బరువును మోస్తూ ఎవడైతే ఈ లోకంలో జీవిస్తున్నాడో వాడొక్కడే సింహంలాగా ధైర్యవంతుడు, గరుడపక్షిలాగా వేగవంతుడు, పెద్దపులిలాగా బలవంతుడు అంటాడు మిల్టన్. వచ్చిన కష్టాన్ని ప్రశాంతంగా నువ్వు భరిస్తుంటే నువ్వు పెద్దపులి లాంటి బలవంతుడివి. జీవితం నుంచి పారిపోతే నీకు జ్ఞానం రాదు. నాకు ఇంటిపట్ల విరక్తిగా ఉంది, ఇంటిదగ్గర నుంచి పారిపోవాలని ఉంది అని భగవాన్‌తో ఒకరు చెప్తారు. అప్పుడు భగవాన్ 'ఇంటి దగ్గరినుంచి పారిపోతావు సరే, ఎక్కడికి పారిపోతావు, నీ భార్యనీ, పిల్లలనీ, అమ్మనీ విడిచి పారిపోతావు. కానీ నువ్వు ఎక్కడికి వెళ్ళినా అక్కడ భూమి ఉంటుంది. అక్కడ ఆకాశం ఉంటుంది. అక్కడ మనుషులు ఉంటారు. మరి అప్పుడు ఎక్కడికి పారిపోతావు? ఇక్కడి నుంచి కాశీ పారిపోతారనుకోండి, అక్కడ కూడా జనం ఉన్నారు కదా. లేకపోతే అరుణాచలం పారిపోతారనుకోండి, అక్కడ కూడా సమాజం ఉంది కదా ఎక్కడికి పోతావు? ఈ భూమిలేని చోటుకి, ఈ ఆకాశం లేని చోటుకి, మనుషులు లేని చోటికి పారిపోతావా' అని భగవాన్ అన్నారు.

మనకొచ్చే తలంపులు కంటే, మన దేహానికి అధికమైన ప్రాముఖ్యత ఇస్తున్నాము. కానీ

ప్రస్తుతం ఈ జన్మలో మనకొచ్చే తలంపులే, మనకి భవిష్యత్తులో వచ్చే శరీరాలని ఇప్పడే తయారు చేస్తున్నాయన్న సంగతి కనీసం  మనకి తెలియదు.  మనం ఇప్పడు ఇంటిదగ్గర కూర్చుంటే ఏ తలంపులు అయితే వస్తున్నాయో, ఆ తలంపులే భవిష్యత్తు శరీరాలకి పునాదులు వేసేస్తున్నాయన్న సంగతి కూడా తెలియకుండా, తలంపుల్ని గాలికి విడిచిపెట్టేసి, దేహం గురించి ఆలోచిస్తున్నాము. మనం ఎంత ఆలోచించినా, ఎంత ప్రయత్నం చేసినా ఈ దేహం కాలి బూడిద అవ్వక మానదు.

మనం పనిచేస్తున్నాము, పనిచేసేవాడు ప్రతీవాడూ డబ్బు కావాలనుకొంటాడు కానీ, ఈ పని నాకు ఆనందాన్ని కలగచేయాలని వాడు అనుకోడు.  ఒక పని చేసేవాడు, ఆ పనిలోంచి వచ్చే పది రూపాయలు, వంద రూపాయలు ఆశించటం తప్పకాదు. ఎందుచేతనంటే వాడికి పొట్ట ఉంది అన్నం తినాలి.  పని చేసేవాడు ఆ పనినుంచి వాడు ఆనందాన్ని అనుభవిస్తుంటే ఆ పనిలో కూడా సౌందర్యాన్ని ఆనందాన్ని అన్వేషిస్తుంటే, వాడికి జ్ఞానం వైపు వెళ్ళే సంస్కారాలు ఏర్పడతాయి.  పొట్ట కూడా వెళ్ళిపోతుంది.  అయితే పని చేసేవాడు ప్రతీవాడు కూడా డబ్బు గురించి ఆలోచిస్తాడు కానీ జ్ఞానం గురించి ఆలోచించడు. నువ్వు పని చెయ్యి, ఫలితాన్ని కోరవద్దు అని భగవంతుడు చెప్పాడు కాని, ఫలితం ఇవ్వనని ఎక్కడా చెప్పలేదు.  పని చేసి విడిచిపెట్టేయి.  ఫలితం వస్తుంది, కానీ నువ్వు కోరకు.

ఒక చిన్న రహస్యం ఉంది.  మీరు గుండెలో దాచుకోండి.  మీ డబ్బుని మీ చీరలని మీ పెట్టెలలో ఎలా దాచుకొంటున్నారో అలాగే ఈ చిన్న రహస్యం మీ గుండెలో దాచుకోండి.  ఎవడైతే పని చేస్తూ ఫలితాన్ని కోరడో, వాడి హృదయంలో ఈశ్వరుడు ఆవిష్కరింపబడతాడు  అంటే ఒకటి ఈశ్వరుడు లభ్యమౌతున్నాడు.  రెండు పొట్ట వెళ్ళిపోతుంది, పని చేస్తూ ఫలితాన్ని కోరుతూ ఉంటే ఆ ఫలితం వస్తే రావచ్చును లేకపోతే రాకపోవచ్చును.  మనం మటుకు ఈశ్వరుడికి దూరం అవుతాము, జీవితం కేవలం ఈ లోకానికి ఈ శరీరానికి పరిమితం అయిపోతుంది.

ఈ మధ్యన ఒకరికి విపరీతమైన జబ్బు చేసింది.  నాకు విషం పెట్టండి నన్ను చంపండి నేను ఈ బాధ భరించలేకపోతున్నాను అని రోజూ అంటున్నాడు.  విషం ఎవరు పెడతారు? కోడళ్ళు పెడతారా, కూతుళ్ళు పెడతారా?  ఒకవేళ పెడితే గవర్నమెంట్  ఊరుకొంటుందా? నన్ను చంపండి నన్ను చంపండి అంటున్నాడు పాపం, బాధ భరించలేక, అంటే ఏమిటి? తన శరీరం కంటే తన సుఖం ఎక్కువ అని ఇక్కడ తెలుస్తోంది కదా?  మీరు పురాణాలు చదువుతున్నారు  అనేక మంది మహాత్ములు చెపుతూ ఉంటే వింటున్నారు.  భక్తి అంటే ఏమిటి?  భక్తి అంటే ఏముందండీ, నిరంతరము పరమేశ్వరుడిని మీరు జ్ఞాపకం పెట్టుకోవటమే భక్తి, నిరంతరము పరమేశ్వరుడిని ఊరికే మీ మనస్సులో జ్ఞాపకం పెట్టుకోవటమే భక్తి.  అంతకు మించిన భక్తే లేదు అసలు.  ఇంకెందుకు మీకు తొందర? మిమ్మల్ని కష్టమైన పనులు చెయ్యమంటున్నానా?  మిమ్మల్ని ఊపిరి పీల్చుకోమని గాలి

విడిచిపెట్టమని ఇటువంటి బాధలు ఏమీ చెప్పటంలేదు. ఆసనాలు వెయ్యమనటం లేదు. మీరు నిరంతరము ఈశ్వరుడిని జ్ఞాపకం పెట్టుకోండి సరిపోతుంది అదే భక్తి.

నెహ్రూ గారు 1947లో గాంధీగారితో ఇప్పడు మనకి స్వరాజ్యం వచ్చింది కదా! ఈ స్వరాజ్యం కోసం మీరు చాలా కష్టపడ్డారు కదా! ఈ స్వరాజ్యం కోసం ఇప్పడు మీకు సంతోషంగా ఉందా? అని అడిగారు. సంతోషం లేదు అన్నారు గాంధీగారు. ఈ స్వరాజ్యం సురాజ్యం అవ్వాలి, సురాజ్యం అవ్వాలంటే రామరాజ్యం రావాలి. స్వరాజ్యాన్ని సురాజ్యం చేసుకుంటే సంతోషిస్తాను కానీ, ఒట్టి స్వరాజ్యం వల్ల నాకు సంతోషం రావటం లేదు అన్నారు.

కొంతమందికి మంచితనం ఉంటుంది. తెలివితేటలు ఉండవు. మంచితనం జీవితంలో అవసరమే. మంచితనం సౌందర్యమే. కానీ ఒక్క మంచితనం ఉంటేనే జీవించలేము. మంచితనంతో తెలివితేటలు కలవాలి. మంచితనంతో కనుక తెలివితేటలు కలవకపోతే జీవించటానికి తగిన సామాగ్రి ఉండదని మన జాతిపిత గాంధీజీ అన్నారు. మంచివాళ్ళని కూడా కొందరు విమర్శిస్తారు. గాంధీగారు గొప్పవాడు అని మనం అనుకొంటున్నాము. ఆయన పటాలు ఇంటిలో పెట్టుకొంటున్నాము. మన దేశంలో పుట్టిన మహాత్ములలో ఆయన ఒకడు అనుకుంటున్నాము. కానీ ఒక కవి ఆయన జాతిపిత కాదు జాతిపీత అన్నాడు. లోకం అంటే ఇంతే! దేశంకోసం, మనుషులకోసం, తన ఎముకలని అరగతీసి ఇచ్చాడు. మట్టిలోనుంచి మాణిక్యాలని తీసాడు. మనం నాలుగు, ఐదు వారాలు రాత్రీపగలు కష్టపడి కష్టపడి పనిచేసి ఎవరి సమక్షంలో అయితే అదంతా మర్చిపోయి, మీ మనస్సు హృదయసముద్రంలో మునుగుతుందో, వాడే మహాత్ముడు.

ఆచార్యులవారు చెప్పేది ఎవడు గొప్పరాజు, ఎవడు గొప్ప చక్రవర్తి అంటే ప్రజలని సంతోషపరిచేవాడే చక్రవర్తి. మనకి రాజులలోకెల్లా గొప్పరాజు, మన పురాణాలలో చెప్పిన గొప్పరాజు, దశరధుడి కుమారుడు రామచంద్రుడు, ఆయన మర్యాదపురుషోత్తముడు. ఎదుటి వాళ్ళని ముందు పలకరించటానికి మనకి గర్వం అడ్డు వస్తూ ఉంటుంది. వాళ్ళు పలకరించాక మనం మాట్లాడతాము. మనకి దారిలో ఎవరైనా ఎదురు పడ్డారనుకోండి. మనకేమీ డబ్బు లేదు, జ్ఞానంలేదు, అందంలేదు, పదవిలేదు, ఏమీ లేవు, అయినా కూడా ఎదుటివాళ్ళు పలకరించనిదే మనం పలకరించము. మనలో ఏముంది? రామచంద్రమూర్తి ఒక చక్రవర్తి కొడుకు, లక్ష్మీదేవికి భర్త, ఇంకొక చక్రవర్తికి అల్లుడు, సుగుణ సంపద కలవాడు, కళ్యాణ గుణాలు కలవాడు. అటువంటివాడు ఎవరు కనిపించినప్పటికీ ముందు ఆయనే పలకరించేవాడు. రోడ్డుమీద నడిచేటప్పడు కూడా ముందు ఆయన తప్పకునేవాడు. ఎవడైతే రాముడిలాగా జీవిస్తున్నాడో, వాడికి జ్ఞానం కలుగుతుంది.

ఎవరైనా కోటిరూపాయలు సంపాదించారనుకోండి, మేము కోటిరూపాయలు

సంపాదించాము అని మనస్సులో అనుకొంటూ ఉంటారు కదా! రామచంద్రమూర్తి టైములో మేము రాముడిని కళ్ళతో చూసాము అనేది అంత భాగ్యముగా ఉండేదట. ఏమి భాగ్యం మేము రామచంద్రమూర్తిని కళ్ళతో చూసామండీ అనేవారట. కలియుగంలో ఇక్కడ కోటిరూపాయలు సంపాదించిన మనిషికి నేను కోటిరూపాయలు సంపాదించాను, జీవితం పొడుగునా కష్టపడ్డాను అని ఎలా అనుకొంటాడో, ఊరికే కళ్ళతో రామచంద్రమూర్తిని అలా చూసి మేము రామచంద్రమూర్తిని చూసాము అదే మహాభాగ్యం అనుకొనేవారు. అదీ రాముడియొక్క ఔన్నత్యం. రావణాసురుడిని చంపటం కోసమే రాముడు జన్మించాడని చాలామంది అనుకొంటారు. రాముడి జీవితంలో రావణాసురుడిని చంపటం అనేది ఒక భాగమే కేవలం రావణాసురుడిని చంపటానికి రాముడు అవతరించనక్కరలేదు, ఆయన ఊరికే గోరుతో ముట్టుకుంటే లోకాలే భస్మం అవుతాయి. సామాన్య మానవుడిగా ఉండి ఎలా జీవించాలో, గృహస్తు ధర్మంలో ఉండి ఎలా జీవించాలో, సోదరుడిగా ఎలా ఉండాలో, బిడ్డగా ఎలా ఉండాలో, భర్తగా ఎలా ఉండాలో, స్నేహితుడిగా ఎలా ఉండాలో, సహచరుడిగా ఎలా ఉండాలో, జీవితాన్ని ఏ కోణంలోంచి చూసినా మచ్చలేని జీవితం, కళంకం లేని జీవితం, పరిశుద్ధమైన జీవితం రామచంద్రమూర్తిది. మీరు ఆయనని భర్తగా తీసుకోండి. సోదరుడిగా తీసుకోండి, బిడ్డగా తీసుకోండి, ఏకోణంలోంచి ఆయన జీవితాన్ని చూడండి, మీకు ఒక మచ్చ కూడా కనపడదు. మేము ఋషులము మేము యోగులము మేము పవిత్రులము అని చెప్పకునే వారికంటే పాపం చేసినప్పటికీ ఎవరికైతే పశ్చాత్తాపం కలుగుతుందో వారు గొప్పవారు అధికులు అన్నాడు షేక్సిపియర్. అంటే మంచి పనులు చేస్తూ అహంకారాన్ని లోపల దాచుకున్న వాళ్ళకంటే, పాపం చేసి పశ్చాత్తాప పడిన వాళ్ళు ముందు తరిస్తారు అన్నాడు షేక్సిపియర్.

కొంతమంది అప్పచేసి, ఆ అప్ప మరిచిపోతారు. అప్పచేసి మర్చిపోతే ఆ అప్ప అలా పెరుగుతూ ఉంటుంది. అహంకారం లోపల పెట్టుకొని, అహంకారాన్ని మరిచిపోయిన వాళ్ళకి కూడా, అహంకారం ఆజన్మ కాజన్మ అలా పెరుగుతూ ఉంటుంది. కొంతమందికి అహంకారం తన లోపల ఉందని కూడా వాళ్ళకి తెలియదు. ఈశ్వరానుగ్రహం ఉంటేనే కానీ లోపల ఉన్న అహంకారం పగలదు.

రాముడిరూపం మనం చూడలేదని మీరెవరూ అనుకోనక్కరలేదు, రాముడి రూపం కంటే రాముడి నామం గొప్పది, పరమేశ్వరుడి రూపం కంటే నామం గొప్పది. భగవంతుడి నామం చేస్తే, దాని వల్ల మనకి ఏమొస్తుంది అనుకొంటారు. మీ బిడ్డే ఉన్నాడు అనుకోండి, మీరేదో పని చేసుకొంటూ ఉంటారు. అమ్మా! అమ్మా! అంటూ అదే పనిగా పిలుస్తూ ఉంటాడు అనుకోండి. మీ పని మరిచిపోయి ఆ బిడ్డవైపుకి మనస్సు వెళ్ళిపోతుంది. అలాగే మనం కూడా భగవంతుడిని నిరంతరం స్మరించటం వల్ల, భగవంతుడి అనుగ్రహం మనమీద

వర్షిస్తుంది. మనం పరిశుద్ధులం అవుతాము మనం పరిశద్ధులం అవ్వటం కంటే చెయ్యవలసిన గొప్ప పని ఈ లోకంలో ఏమీ లేదు. అది మరిచిపోకండి. మనం సంపాదించిన ఐశ్వర్యాలు కానీ మనకున్న గొప్పలు కానీ, మనం సంపాదించే ఏ వస్తువుకూడా విధికంటే గొప్పది కాదు. మనం సంపాదించేదంతా కూడా విధి ప్రవాహంలో కొట్టుకొని పోవలిసిందే. విధి కంటే బరువైన వస్తువు కాదది. అది ఐశ్వర్యం అనండి. లేకపోతే రూపం అనండి. ఏదైనా సరే, మనకి సృష్టిలో కనిపించే ఏ వస్తువు కూడా విధి కంటే గొప్పది కాదు. ఎంత గొప్ప వస్తువు అయినా విధియొక్క ప్రవాహంలో కొట్టుకుపోవలసిందే, కాల ప్రవాహంలో కొట్టుకుపోవలసిందే. సామ్రాజ్యాలే కొట్టుకుపోయాయి. ఇంక మన ఐశ్వర్యాలు ఎంత?

కలియుగంలో అశోకుడు ఒక గొప్ప చక్రవర్తి. మన పురాణకాలంలో రాముడు ఎటువంటి వాడో, మళ్ళీ ఈ యుగంలో వచ్చేటప్పటికి అశోకుడు, అక్బర్ వాళ్ళు గ్రేట్ ఎంపరర్స్. ఎవడైతే ప్రజలని సంతోషపెట్టేలా, వాళ్ళ హృదయాలని రంజింపచేసేలా పరిపాలిస్తాడో వాడే నిజమైన రాజు. ప్రతీరాజు జ్ఞాని అవ్వడు. జ్ఞాని అయినవాడు రాజు అయితే అక్కడి ప్రజలు సుఖపడతారు. అదీ ఇక్కడ రహస్యం.

అరవింద్‌ఘోష్ సావిత్రి అనే పుస్తకాన్ని నలభైసంవత్సరాలు రాసాడు. రాత్రీ పగలు ఒకే గదిలో కూర్చున్నాడు. నలభై సంవత్సరాలు ఆ గదిలోనుంచి కిందకి దిగలేదు. మనకి జనాలు కనపడకపోతే తలపోటు వచ్చేసి మతి పోతుంది. ఈ ఆశమ్మ పోశమ్మ ఏరోజుకారోజు కనపడవలసిందే. కనిపిస్తే ఏంటి కనిపించకపోతే ఏంటి? రోజూ మాట్లాడేవాళ్ళు ఒకవేళ మనని పరాకున పలకరించకుండా వెళ్ళిపోయినా మనకి దుఃఖం వచ్చేస్తుంది. వాళ్ళు పలకరించకపోతే వీడికేంటి? రోజూ పలకరించేవాడు ఒక రోజు పలకరించకపోతే ఏమౌతుంది? అత్తగారు కోడలిని పలకరించకపోతే, కోడలు బెంగపెట్టుకుంటుంది. ఆ నిమిషంలో దుఃఖం వచ్చేస్తుంది. అజ్ఞానం కమ్మేస్తుంది. అంత చిన్న చిన్న హృదయాలు, చిన్న చిన్న మనసులు మనవి. కోడిపిల్లలు చూడండి. కాకిని చూసినా గద్దని చూసినా పారిపోతూ ఉంటాయి అవి ఎత్తుకుపోతాయని. మన జీవితాలు కూడా అంతే. ఇటువంటి పిరికివాళ్ళకా జ్ఞానం కలిగేది?

అరవింద్‌ఘోష్ గారు “సావిత్రి”లో రెండేరెండు మంచి గుణాలు మానవజాతి కల్టివేట్ చెయ్యాలని చెప్పారు. ఒకటి ధైర్యం, రెండు ప్రేమ. ఈ రెండు గుణాలు “సావిత్రి” పొడుగునా నొక్కి నొక్కి ఏదో ఒక మూలనుంచి చూపిస్తున్నాడు. ఒకటి ధైర్యం, రెండు ప్రేమ. ఆయన ఏమన్నాడంటే, మీకు కనుక ధైర్యం లేకపోతే, మీలో ఎన్ని సుగుణాలు ఉన్నా రాణించవని చెప్పాడు. మనకెవరైనా భోజనం పెట్టి, కూరలు అన్నం అన్నీ వడ్డించి, చివరికి ఆకులో ఉమ్మి వేస్తే ఎలా

ఉంటుంది? అది మనం తినగలమా? అదేవిధంగా మనలో ఎన్ని సుగుణాలు ఉన్నప్పటికీ పిరికితనం కనుక ఉంటే, ఆ పిరికితనం ఉమ్ము లాంటిదన్నమాట. మనలో ఎన్ని సుగుణాలు ఉన్నప్పటికీ, మనలో పిరికితనం కనుక ఉంటే, ఆ సుగుణాలు రాణించవు అని చెప్పాడు. "కవర్డ్స్ డై మెనీ టైమ్స్, బట్ ది బ్రేవ్ ఓన్లీ ఒన్స్" అంటాడు షేక్స్‌పియర్ ఒకచోట. ఒకటి ధైర్యం రెండు ప్రేమ, ఈ రెండు సుగుణాలు మీరు అలవరుచుకోండి, సమస్తసుగుణ రాశి మిమ్మల్ని వరిస్తుంది అని అరవింద్ ఘోష్‌గారు తన సావిత్రిలో చెప్పారు. కొంతమంది ప్రేమ అనేది ఎలా ఉంటుందో తెలియకుండా బ్రతుకుతారు. దేశాన్ని ప్రేమించనక్కరలేదండి, కొంతమంది భార్యని ప్రేమించరు, పిల్లలని ప్రేమించరు. ఇంటిలో ఉన్న మనుషులని ప్రేమించరు. అలా ఆల్చిప్పలలా వంద సంవత్సరాలు బ్రతికి రాలిపోతారు. ప్రేమ అనేది ఎలా ఉంటుందో కూడా తెలియకుండా, కనీసం ఇంటిలో ఉన్న నలుగురినీ కూడా ప్రేమించ లేకుండా, వాళ్ల జీవితాలు సూర్యుడు అస్తమించినట్టు కాలగర్భంలో కలిసిపోయిన మనుషులు ఉన్నారు. కొంతమందికి ఏం తింటున్నాము ఏం కట్టుకుంటున్నాము, ఇదే గొడవ. ఈ రెండు హద్దులూ దాటి బయటికి రాలేరు. వాళ్లు తిన్నా ఫరవాలేదు, మనతో చెపుతూంటారు అస్తమానూ, అది కట్టుకున్నామండీ ఇవి తిన్నాము అని! మళ్లీ మన టైం కూడా వేస్ట్ చెయ్యటం టైమ్ కిల్లర్స్ వాళ్ళు.

ధైర్యం కనుక లేకపోతే ఆ జీవితానికి సొగసు లేదు, ఆ జీవితం రాణించదు. ధైర్యం చాలా గొప్పది. అయితే ఎవడు నిజమైన ధైర్యవంతుడు? మనస్సులో వికారాలు పుట్టకుండా ఎవడైతే తన ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాడో వాడు నిజమైన ధైర్యవంతుడు. వాడు ప్రేమ స్వరూపుడు. దారిన పోయేవాడిని నాలుగు లెంపకాయలు కొట్టి, నేను ధైర్యవంతుడిని అంటే వాడు ధైర్యవంతుడు కాదు. ధైర్యవంతుడంటే తన ప్రారబ్ధాన్ని నిర్మలమైన హృదయంతో ప్రశాంతమైన మనస్సుతో అనుభవిస్తున్నాడో, వాడే ధైర్యవంతుడు, వాడే ప్రేమస్వరూపుడు. ధైర్యవంతుడికి సముద్రంకూడా పొలాలలో నీరు పెట్టుకునే చిన్న బోదెలు (కాలువలు) లాగ కనిపిస్తుంది. పిరికివాళ్లకి పొలాలలో ఉన్న బోదెలు సముద్రంలాగా కనిపిస్తాయి. పొలాలలో బోదెలు ఎవరైనా దాటి వెళ్లిపోవచ్చు. అలా ధైర్యవంతుడు ఈ ప్రకృతిని దాటి వెళ్లిపోతాడు. వాడు ధైర్యవంతుడు అని భర్తృహరి ఒకచోట చెపుతాడు. ఎన్ని సాధనలు చేసినా ఎన్ని ప్రార్ధనలు చేసినా ధైర్యం లేకపోతే రాణించదు. మొత్తం సద్గుణాలలో మంచి సుగుణం ప్రధానమైన సుగుణం, కమాండర్ ఇన్ ఛీఫ్ బీ ఫియర్లెస్ అంటే నిర్భయంగా ఉండు. భగవంతుడు చెప్పిన మొట్టమొదటి సుగుణం అభయం. బీ ఫియర్లెస్ అభయం, భయం లేకుండా ఉండు. మొత్తం 27మంచి గుణాలు చెప్పి, ఆ 27మంచి గుణాలకు కమాండర్ మట్టుకు "బి ఫియర్లెస్" అని భగవంతుడు చెప్పాడు. భయం లేకుండా ఉండు అంటాడు స్వామి వివేకానంద.

శరీరానికి కావలసింది ఎక్కువ అందం కాదు, ఆరోగ్యం. శరీరానికి ఆరోగ్యం చాలు.

నా శరీరం చాలా అందంగా ఉంటుందనుకోండి, నేను ఎప్పుడూ అనారోగ్యంతో బాధపడుతున్నాను అనుకోండి. ఏమి సుఖం? ఇది కామన్‌సెన్స్ పాయింటు. నా శరీరం చాలా అందంగా ఉంటుంది. 24గంటలు నేను అనారోగ్యంతో బాధపడుతున్నాను, నాకు ఏం ఉపయోగపడుతుంది? నాకు బర్డెన్‌గా తయారవుతుంది. ఎవరైనా ఇంటిలో మందు సీసాలు ఎక్కువగా ఉంటే, ఆ ఇంటిలో అంతమంది రోగులు ఉన్నారన్న మాట. కొంతమంది ఆరోగ్యంగా ఉన్నప్పుడు ధైర్యంగా ఉంటారు. కానీ జర్వం వస్తే బెంబేలు పడిపోతారు. ఎందుచేతనంటే ధైర్యాన్ని ఎంతోకొంత ప్రోత్సాహం చేసేది ఆరోగ్యమే కానీ, అనారోగ్యం ప్రోత్సాహం చెయ్యలేదు. అందుకే మనం ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. అనారోగ్యం పిరికితనాన్ని తీసుకొస్తుంది. ఆరోగ్యం ధైర్యాన్ని తీసుకొస్తుంది.

ఫిలాసఫర్ ఎప్పడైతే కింగ్ అవుతాడో, జ్ఞాని ఎప్పడైతే రాజు అవుతాడో వాడే ప్రజారంజకంగా ప్రజలని పాలించగలడు. మనకి రామచంద్రమూర్తి, ధర్మరాజు, అలాగే అశోకుడు, అక్బర్ మనకి కనిపిస్తున్నారు. వాళ్ల శరీరాలు మరణించవచ్చు, కాని వారు మన హృదయాలలో జీవిస్తున్నారు. వాళ్ళు గ్రేట్ కింగ్స్. అందుచేత జీవితాన్నంతా కూడా ఎవడైతే పూజగా తీసుకొంటున్నాడో, జీవితాన్ని అంతా కూడా ఎవడైతే యోగంగా తీసుకొంటున్నాడో, జీవితాన్ని అంతా కూడా ఎవడైతే తపస్సుగా తీసుకొంటున్నాడో ఎవడైతే జీవితాన్ని సమగ్రంగా చూడగలుగుతున్నాడో, అందంగా ఎవడైతే జీవించగలుగుతున్నాడో, వాడిదే నిజమైన జీవితం. వాడు పది సంవత్సరాలు జీవించినా, ఇరవై సంవత్సరాలు జీవించినా, వంద సంవత్సరాలు జీవించినా, అవి కలకాలం, చిరకాలం మనం స్మరించుకోతగ్గ జీవితాలు. ఇంతకీ శ్రీ అరవింద్ చెప్పేది ఏమిటంటే, మీకు గొప్ప జీవితాలు కావాలంటే, మీ జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుకోవాలంటే, ఆదర్శాలతో ఆశయాలతో ఆకాంక్షలతో ఉదాత్తమైన భావాలతో మీరు వెలిగిపోవాలంటే, ఈ రెండు మంచి గుణాలని మీ హృదయంలో దాచుకోండి, ఒకటి ధైర్యం, రెండు ప్రేమ. పక్షి ఏవిధంగా అయితే రెండు రెక్కలతో గాలిలో ఎగురుతోందో, అదే విధంగా ఈ రెండు గుణాలని మీరు ఆసరాగా తీసుకొని, ఈ రెండు గుణాలని మీ హృదయంలో పదిలపర్చుకొని, మీ జీవితంలో ఉజ్వలమైన భవిష్యత్తుకి బాటలు వేసుకోండి. ఈ జన్మ కంటే మంచి జన్మ మరొకటి రావాలంటే, ఇంతకంటే ఉదాత్తమైన జన్మ, ఇంతకంటే మనం ఆధ్యాత్మికరంగంలో అభివృద్ధి అవ్వటానికి అనుకూలమైన జన్మ రావాలంటే, ధైర్యం, ప్రేమ ఈ రెండు సుగుణాలను అలవరచుకొంటే, ఇంతకంటే మంచి వాతావరణంలో ఇంతకంటే మంచి పరిస్థితులలో మనం జీవించటానికి అవకాశం ఉంటుంది. అందుచేత ఈ రెండు మంచి గుణాలని అలవరచుకోమని శ్రీ అరవిందులు మనకి పదే పదే చెపుతున్నారు.

ఓం శాంతి ఓం శాంతి ఓం శాంతి

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# శ్రీకృష్ణాష్టమి

ప్రతి సంవత్సరం శ్రావణ బహుళ అష్టమి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటాం. శ్రీకృష్ణ జయంతి, శ్రీవ్యాస జయంతి, శ్రీశంకర జయంతి, శ్రీరమణ జయంతి మున్నగు అవతార పురుషుల, మహాత్ముల పుట్టినరోజులు జరుపుకుంటూ, వారిని స్మరించుకోవడం వల్ల, మన మనస్సు శుద్ధమవుతుంది. శ్రీకృష్ణుడు పూర్ణబ్రహ్మము, కాలాతీతుడు కాబట్టి పుట్టినరోజు అనే మాట ఆయనకు వర్తించదు, కాని శ్రీకృష్ణుడు దేహం ధరించిన రోజు మనకు ఎంతో పవిత్రమైనది. స్వయంగా పరమాత్మ, లీలా పురుషోత్తముడు, యోగీశ్వరుడు, అయిన శ్రీకృష్ణుడు ధర్మసంస్థాపన మరియు శాంతి స్థాపన ద్వారా జీవకోటిని అనుగ్రహించుటకు అవతరించిన పరమ ప్రేమ మూర్తి. ఆయనది పూర్ణావతారం కాబట్టి, భూమి మీద సంచరించిన కాలంలో తాను నెరవేర్చిన కార్యములు బహుముఖమైనవి. 'కృష్ణ' అంటే జీవభ్రాంతిని హరింపజేసే జన్మ సంబంధమైన వాసనలు లేని తత్త్వం. జగద్గురువుగా, ఉపనిషత్తుల సారమైన భగవద్గీత ప్రబోధము ద్వారా దేశ, కాల, కారణాలకు, అతీతమైన దివ్య జ్ఞాన బోధను అందించాడు. 'తత్త్వమసి' అన్నది భగవద్గీతాసారం. అనంతుడు, సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, అయిన శ్రీకృష్ణుడు అందరి హృదయాలలోనూ అంతర్యామిగా ఉండి, జీవకోటిని వారి వారి ప్రారబ్ధానుసారం ఆడిస్తున్నాడు. శ్రీకృష్ణుని మానవతా కోణం అద్భుతం. ఏవిధమైన కర్మాచరణ మరియు అవగాహన ద్వారా మానవ జన్మను సార్థకం చేసుకోగలమో, ఎలాగ జీవిస్తే భ్రాంతి రూపమైన అజ్ఞానము నుండి విడుదల పొంది అమృతానుభవం పొందగలమో, ఏది తెలుసుకుంటే ఆపై తెలుసుకోవలసినది మరేదీ ఉండదో, అటువంటి స్వరూప జ్ఞానాన్ని ఆయన జీవితము మరియు బోధ ద్వారా మనకు అందించారు. సకల మానవాళి దుఃఖము అశాంతి నిర్మూలనకు అద్భుతమైన ఔషధమే శ్రీకృష్ణుని సందేశం.

**(ది॥ 15-08-2017న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# మనస్సులో అంటిపెట్టుకొన్న గుణాలను దులుపుకోవటమే సాధన

మనకు దుఃఖం అధికమైనప్పుడు జోతిష్కుని వద్దకు వెడతాము. అతడు మంచి రోజులు ఉన్నాయని చెబుతాడు కాని ప్రస్తుత వ్యధ తొలగించుకొనే ఉపాయమును చెప్పడు దానాలు, ధర్మాలు అనే పై పూతలతో ప్రయోజనం లేదు. మనోవ్యధకు మూలకారణాన్నీ వెదకాలి, నిర్మూలించాలి. ఎందుకు ఈ బాధ ఈ దేహంతో, మనస్సుతో కలిసి ఉండటమే ఆ అసలు బాధను దులుపుకోవాలి. నిరుపేదకు, మిక్కిలి భాగ్యవంతునికి ఈ నిజం తెలియకపోతే కష్టాలు తప్పవు. మనిషి సుఖపడాలంటే మధ్యతరగతికి చెందిన సాధకుడుగా ఉండటమే ఉత్తమం, డబ్బు భూములను కొంటుంది. అదృష్ట అనుకూలవతియైన భార్యను తెస్తుంది. దాన్ని గ్రహించాలి. కోరికకు శక్తి లేదు - మహాత్ములు ఎల్లప్పుడు ఏదో సత్కార్యములు చేస్తూనే ఉంటారు వారికి చెడు తలంపులు రావటానికి ఒక్క నిమిషం తీరిక ఉండదు. వారిని కామాన్ని ఎలా జయించారు అంటే "ఏదో సత్కార్యంలో నిమగ్నుడునైయుండుటచేత దానికి విసుగు పుట్టి తిరిగి వెళ్ళిపోతుంది. కాళీగా ఉన్న మనస్సులోనే కోరికలు అనే దెయ్యాలు వర్కుషాపు పెట్టుకొంటాయి. దరిద్రం, దుఃఖం, వ్యాధి, అజ్ఞానం, దుర్మార్గం, దొంగతనం వాటిని పోగొట్టే ప్రేరణ గల గురుబోధ కావాలి. అదే శాంతికి సాధనకు కారణమౌతుంది. శ్రీనాన్నగారు "ఉండవలసినంత వైరాగ్యం మనకు లేకపోవటం వల్లనే సాధన చెయ్యలేకపోతున్నాము వైరాగ్యం గల వాణ్ణి చూచి విలాస పురుషుడు మెచ్చుకోడు గంట గంటకు మారిపోయే మనస్సును రోగాలతో సతమతమౌతున్న శరీరాన్ని నమ్మినట్లు భగవంతుణ్ణి నమ్మలేకపోతున్నాము" అన్నారు. గడియారంలో పెండ్యులం టిక్ టిక్ అంటూ ఏవిధంగా ఊగుతుందో అదేవిధంగా మానవుడు నవ్వుకూ ఏడుపుకూ మధ్య ఊగుతూ తన చుట్టూ కారాగర గృహాన్ని నిర్మించుకొంటాడు. మనం స్వతంత్రులము కావాలంటే అసలు బంధిస్తున్నది ఏమిటి? అని తెలుసుకోవాలి. ఒక కోతి చాలా ఇరుకైన బోనులో ఎరను చూచింది. కోతి చేయి పెట్టి చేయి నుండి తినుబండారాలను బిగించి లాగింది చేయి రాలేదు. ఆ పదార్థాలను వదిలేస్తే దాని నుండి బయటపడుతుంది. కాని దాన్ని వదలలేదు చేయి బయటకు రాదు. అలాగే మనం మొదట మనమే దుఃఖంతో బంధించుకొన్నాము. నాది - నాది అని ముద్రలు వేసుకొంటున్నాము. మనస్సు అనే సంకుచిత పాత్రలో పదార్థాలను పెట్టుకొని దానితో తాదాత్మ్యం పొంది బానిసలు అవుతున్నాము. భయాలతో, వ్యామోహాలతో మనకు స్వేచ్ఛ కావాలి. అంటే నేను - నాది అనే పరిమిత దృష్టిని వదిలిపెట్టాలి. ఈ విశ్వమనే మహా అరణ్యంలో అంతా నాదే అనుకోవాలి. వస్తువులయందు వెర్రితో కూడిన మోహబుద్ధిని విడిచి నేను ఆత్మను అనే స్థిరబుద్ధి వృద్ధి చేసుకోవాలి. సంపన్నులు రోగగ్రస్తమై దుఃఖం అనుభవిస్తే దరిద్రులు రోజులు గడవక అలమటిస్తున్నారు. కొందరు సంతానం లేక, కొందరు అధిక సంతానంతో కోరికలతోనూ, కొందరు అప్పలు తీర్చలేక, కొందరు డబ్బుకోసం కోర్టులచుట్టూ తిరగలేక ఏదో వ్యధ ఏడిపిస్తుంది. శరీర వాసన అంటిపెట్టుకొని ఉన్నంతకాలం ప్రపంచంలోని బాధలన్నీ మనలను పీక్కొనితింటాయి కాబట్టి దాని బంధాలను బస్మం చేస్తే గురు అనుగ్రహంతో తక్షణం సాటిలేని ఆనందం మనకు కలుగుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966**